

జనవరి 1న కట్టమూరు భక్తులచే సద్గురు పాదపూజ



ముక్కోటి ఏకాదశినాడు ఉత్తరద్వార దర్శనం



ముక్కోటి ఏకాదశినాడు శ్రీ మాజేటి పాండురంగనాథ్
కుటుంబ సభ్యులచే సద్గురు పాదపూజ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 7

పేజీలు 44

మార్చి 2022

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట.................................... ............ 7

అగస్త్య హృదయం ....................... .............9

హనుమంతుని తోకలో గంట .............11

సర్వ సమర్పణ ..................................................14

మాఘమాస ప్రాశస్త్యం ..................................16

పుస్తక జ్ఞానం - అనుభవ జ్ఞానం .......19

ఆప్తుడు ............................................................21

సుందర గీత .................... ...............................25

కైవల్యోపనిషత్ ... ..........................................28

నాదబిందు కళలు .......................................30

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................32

శ్రీ ప్రకాశానంద స్వామి ...............................33

నిరీక్షణ ............................... ............................35

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37

సత్సంగం .................... ...................................... 39

పత్రిక యాజమాన్యం వివరాలు....... 40

విష్ణు కథలు ....... ............................ ..................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

20) శ్రీరమ సీతగాగ నిజసేవక బృందము వీరవైష్ణవా
చార జవంబుగాగ విరజానది గౌతమిగా వికుంఠ ము
న్నారయభద్ర శైలశిఖరాగ్రముగాగ వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ!

భావం - లక్ష్మీదేవి సీత, సేవకులు వైష్ణవజనులు, విరజానది గోదావరి, వైకుంఠము భద్రాచలము కాగా ప్రాణులను ఉద్ధరించునట్టి విష్ణువు నీవే కాదా దాశరథీ కరుణాపయోనిధీ!




*పిడకల నుండి పాండురంగ నామం ఎలా వినబడింది?
*వేదాంత పరిజ్ఞాత అయిన డిప్యూటీ కలెక్టర్ ఎవరు?
*సమస్త అమంగళాలు ఎక్కడ అంతమవుతాయి?
*పరమాత్మ ఈ సృష్టిని ఏ ముడిపదార్థంతో తయారు చేశాడు?
*నీవు సకల సంపదలకు అధిపతివి ఎలా అవుతావు?
*సూర్య రథం లోని సప్తాశ్వములను దేనికి ప్రతీక?
*ప్రపంచంలో పొందలేనిది, సద్గురుదేవుల సన్నిధిలో పొందేదేది?
*ఏది కలిగియున్నవారికి సంకల్పవికల్పాలు వుండవు?
*పండితులు రాజును ఎందుకు వదిలివేశారు?
*కృష్ణుడు తన స్వహస్తాలతో ఎవరికి భోజనం తినిపించాడు?
*గురుదేవులు మనకు అందించే భోజనం ఏది?

*సమాధానాలు లోపలి పేజీలలో ..............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

13-12-1980

ఈరోజు ఆశ్రమానికి వెళ్ళేసరికి రాత్రి 8గం॥లు అయ్యింది. సుమారు 9గం॥లకు శ్రీ బాబూజీ భక్తులకు దర్శనం యిచ్చారు.

నేను, రత్నంగారు, డా॥రాజు, నారాయణరావుగారు, నారాయణగారు, సత్తిరాజుగారు, రాజుగారు ఉన్నాము. నారాయణ శ్రీ బాబూజీ పాదసేవ చేసుకోబోయాడు.



శ్రీ బాబూజీ వెంటనే కలుగ జేసుకుని "ఆ పని చేయటానికి వేరే మనిషి ఉన్నారు కదా! నీకెందుకు ఆ శ్రమ" అన్నారు. నారాయణ పాదసేవ చేసుకోలేదు. ఇంతలో అప్పుడే వచ్చిన చరణ్‌దాస్ కలుగజేసుకొని 'గురుపాదసేవ చేసుకోవటానికి మేమంతా అర్హులమేకదా!' అన్నాడు.

శ్రీ బాబూజీ కలుగజేసుకొని 'ఇప్పుడు ఈ క్షణంలో అర్హులే' అన్నారు. చరణ్‌దాస్ వెంటనే పాదసేవ ప్రారంభించాడు. శ్రీ బాబూజీ కలుగజేసుకొని 'వద్దు నాయనా నువ్వు చేయవలసిన పని వేరే ఉంది' అన్నారు.

"రావణాసురుడు మహాపండితుడు. అన్ని విద్యల్లోను ఆరితేరినవాడు. మహాభక్తుడు. శివుడిని మెప్పించి వరాలు పొందాడు. బ్రహ్మని మెప్పించి వరాలను పొందాడు. సకలశాస్త్ర పారంగతుడు. నమకం, చమకం రచించినవాడు, మహాతపస్వి. అట్టివాడు కామప్రలోభియై మహాసాధ్వి సీతను అపహరించి వివాహమాడ తలచాడు. రావణాసురుడి భార్య మండోదరి మంచి భక్తురాలు, శీలవతి. ఒకసారి తన భర్తతో 'స్వామీ! తమరు అన్ని మాయలనూ జయించిన వారు కదా! సకల శక్తి సంపన్నులు కదా! మరి సీతను వరించటానికి రాముని వేషధారియై ఎందుకు వెళ్ళకూడదు?' అని సందేహము

వెలిబుచ్చింది. దానికి రావణాసురుడు సమాధానం చెప్తూ 'శ్రీరామ చంద్రుడు గుణరహితుడు, నిరాకారుడు, నిర్వికల్పుడు. సాక్షాత్తు విష్ణుమూర్తియే సగుణ బ్రహ్మయై అవతరించాడు. అట్టి గుణరహితుని రూపాన్ని ధరిస్తే గుణాలు ఎక్కడ ఉంటాయి? అందుచేత శ్రీరామచంద్రుని రూపము ధరించి సీతను పొందటం సాధ్యంకాదు. ఆ సుందర రూపం ధరించినప్పుడు ప్రేమయేగాని కామవికారం వుండదు' అంటాడు.

అప్పుడు మండోదరి తిరిగి రావణాసురుని ప్రశ్నిస్తూ, 'ఇంతటి జ్ఞానివైన మీకు ఎందుకు కామవికారం కలిగింది? స్వామీ!' అంటుంది.

రావణుడు కలుగజేసుకుని, 'అది విధివ్రాత' అంటాడు. రావణుని జీర్ణాశయములో అమృతభాండం ఉంది. అంతేకాక అనేక వరాల్ని పొందాడు. రావణ సంహారం చాలాకష్టంతో కూడినది. అందుచేతనే మాయ రావణుని ఆవరించి ఆ కామప్రలోభాన్ని కలిగించింది.

అది కేవలం రావణాసురునికి ముక్తి ప్రసాదించటానికే. శ్రీరామ చంద్రునితో తాను యుద్ధంచేసి తాను గెలుపొందితే పురుషోత్తముడు తానవుతాడు లేక శ్రీరామచంద్రుని చేతిలో మృతిచెందితే నిరతిశయమైన పరమపదము ప్రాప్తిస్తుంది, అని ఊహిస్తాడు రావణాసురుడు.

రావణాసురునిలో మంచి తేజస్సు ఉంది. హనుమంతుడు లంకలో రావణాసురుని చూడగానే అతనిలో దివ్యతేజస్సుని చూసి తబ్బిబ్బు అవుతాడు. రావణునిలోని శివతేజస్సును హనుమంతుడు చూసి 'ఆహా! ఏమి ఈ దివ్యతేజస్సు ఇంతటి తేజోస్వరూపుడా! ఈ నీచకార్యానికి దిగింది?' అని ఆశ్చర్యపోతాడు.

కాబట్టి జ్ఞాన జిడ్డు పొందాలి. జ్ఞానజిడ్డు కలిగి ఉన్నవారికి సంకల్పములు, వికల్పములు ఉండవు. అతనిది అభేదస్థితి. స్త్రీ పురుషభేదం తెలియదు. ఇప్పుడు నేను చెప్పిన దానిని మీరు జాగ్రత్తగా అర్థం చేసుకోండి" అన్నారు శ్రీ బాబూజీ.

## అమ్మ మాట

- రమణ ప్రసాద్

*భగవంతుడిచ్చిన బహుమానం*

అన్ని జన్మలలోను అత్యంత ఉత్తమమైన ఈ మానవ జన్మ మనకి వచ్చింది. అంటే అది గురుపరమాత్మ (భగవానుడు)యొక్క దివ్యప్రసాదం! అటువంటి ఉత్తమోత్తమమైన మానవుడిని సృష్టించి, భగవానుడు తన అవ్యక్తమైన దివ్యచైతన్య రూపాన్ని అతడిలో ప్రవేశపెట్టాడు.



బయట దేవాలయాలలో విగ్రహాలను మనం ప్రతిష్ఠ చేస్తాము. కానీ, మనలోనూ సకల చరాచర సృష్టిలోనూ తనకు తానుగా లోపలికి ప్రవేశించి, స్వయంభూగా తనని తానే మనలో ప్రతిష్ఠించుకున్నాడు. తాను లోపల వుండి మనని నడిపిస్తున్నాడు. అదే భగవానుడు భగవద్గీతలో

**ఈశ్వర స్సర్వభూతానాం**
**హృద్దేశేర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని**
**యంత్రారూఢాని మాయయా॥** అని శెలవిచ్చాడు. కనుక భగవంతుడు మనకి ప్రసాదించిన ఈ మానవజన్మ ఒక గిఫ్ట్. దీనిని వ్యర్థం చేసుకుంటే మళ్ళీ మనకి ఏ జన్మ వస్తుందో చెప్పలేము. అందుకనే **దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవ స్సదాశివః** - అని చెబుతోంది ఉపనిషత్తు. లోపల తాను అవ్యక్తంగా వుండి మానవుడి చేత అన్నీ చేయిస్తూ వుంటే 'ఇదంతా నా గొప్పే! నేను చేస్తున్నాను' అని విర్రవీగుతాడు మానవుడు. ఈ శరీరము, మనస్సు, ప్రాణము, పంచకోశాలు అన్నీ జడమే. అందుకే ఒక కీర్తనతో,

**కదిలేదేదీ నిజం కాదని, కదలని దొక్కటి వున్నదనీ**
**ఆ కదలనిదే ఈ కదిలే వాటిని కదిలిస్తోందని గ్రహించుకో** - అని అందించారు శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్‌వారు.

కనుక ఈ మానవజన్మ భగవంతుడు మనకిచ్చినందుకు మనలోనే వున్న ఆ దివ్య చైతన్యమే 'అసలు నేను' అని గుర్తించాలి. ఈ దేహము, పంచకోశాలు 'నేను' కాదు అని తెలుసుకోవాలి. అదే మోక్షము.

ఈ మోక్షము అనేది మరణించాక వచ్చేది కాదు. చనిపోయాక వచ్చేది బూడిదే! అందుకే మనలో ప్రాణం వుండగానే, ఈ శరీరానికి జ్వరము తలనొప్పి వస్తే ఎలాగ అనుభవిస్తావెూ అలా ఆత్మానందాన్ని అనుభవించాలని శ్రీగురుదేవులు ఎప్పుడూ చెప్పేవారు. ఇంకా ఆ కీర్తనలో

**కొడిగడుతున్నది ఈ దీపం పడిపోయేదే ఈ దేహం**

**దీపం కొండెక్కేలోగానే నీ పని చక్కగ ముగించుకో** - అనుభవించిన వారికి ఆ అనుభూతి ఎప్పటికీ వుండిపోతుంది. మనం బయటి ప్రపంచంలో పొందనటువంటి ఆనందం ఎవరి సన్నిధిలో పొందుతామో అదే దైవసన్నిధి లేక సద్గురుదేవుల సన్నిధి. అటువంటి సత్య గురుదేవుల సన్నిధి మనకి లభించింది. శ్రీ ఆదిశంకరాచార్యులు చెప్పిన మూడు దుర్లభమైనవి 'మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయం' మనకి మన కష్టం లేకుండా లభించాయి. భగవానుడు నిండుగా వడ్డించిన విస్తరిని మన ముందు వుంచాడు. ఇక తినడమే తరువాయి. నిర్హేతుక జాయమాన కరుణాకటాక్ష స్వరూపులైన మన గురుదేవులు, తామే కలిపి మనకి గోరుముద్దలు తినిపిస్తున్నారు. అయినా కూడా తినకుండా దానిని చిందరవందర చేసి, ఉమ్మివేస్తే తప్పెవరిది? గురుదేవులు మనకు అందించేది బ్రహ్మామృతమనే భోజనం. దానిని మనం కడుపు నిండా నింపుకుని 'పేపర్ బేబీ'గా అవ్వాలని వారి కోరిక. బ్రహ్మజ్ఞానికి అదొక్కటే ఆశ.

భగవంతుని (గురుదేవుడు) యందు గాఢమైన విశ్వాసం కలిగి వుండటమే భక్తి. సద్గురుదేవులు చెప్పినది తు.చ. తప్పకుండా ఆచరిస్తాననే దృఢమైన పట్టుదల కలిగి వుండటమే వైరాగ్యం. ఈ భక్తి, విశ్వాసాలనే రెండు రెక్కలు గట్టిగా వుంటే చిటారు కొమ్మమీద వున్న ఫలాన్నే అందుకోవచ్చు. అది సాధించడానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చాలా ముఖ్యం. విచారణ అన్నిటికంటే గొప్పది. కానీ, సాధకుడైనవాడికి ఉపాసన అనేది కూడా చాలా ముఖ్యం. వాటి గురించి మరొకసారి చెప్పుకుందాం. అటువంటి ఉపాసన చేయడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# అగస్త్య హృదయం

గత సంచిక తరువాయి

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

15. **నక్షత్ర గ్రహ తారాణాం అధిపో విశ్వభావనః।**

**తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్ నమోస్తుతే॥**

తాత్పర్యము - నక్షత్ర గ్రహాదులకూ, తారలకూ అధిపతి అయినవాడును, భావనమాత్రముచేతనే విశ్వమును సృష్టించినవాడును, తేజస్సులన్నిటికీ మించిన తేజస్సు కలవాడును, ద్వాదశాదిత్యుల రూపములో విలసిల్లు సూర్యభగవానునికి నమస్కారము.

ఇంతవరకూ ఆదిత్యునితోపాటుగా గురువు యొక్క విశిష్ఠతను వివరించిన అగస్త్యులు ఈ శ్లోకం ద్వారా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూలమైన గురుపరబ్రహ్మ తత్వమును మరోమారు ప్రకటిస్తూ అంజలి ఘటిస్తున్నారు.

నక్షత్ర గ్రహ తారాణామధిపః - అన్న సంబోధనతో ముల్లోకములతో పాటు చతుర్దశ భువనములకు అధిపతియైన గురుపరమాత్మని సూచిస్తూ శ్రీ మహావిష్ణువు యొక్క వామనావతార ఘట్టమును అగస్త్యులు గుర్తు చేస్తున్నారు. బలిచక్రవర్తిని మూడు అడుగులు అడిగిన వామన మూర్తి క్రమముగా పెరుగుతూ ...

**'ఇంతింతై వటుడింతయై - మరియు దానింతై - నభోవీథిపై నంతై - తోయద మండలాగ్రమున కల్లంతై - ప్రభారాశిపై నంతై - చంద్రునికంతయై - ధృవునిపైనంతై మహర్వాటిపై ......'** అని వివరించినట్లు బ్రహ్మాండమంతా వ్యాపించిన త్రివిక్రమ రూపమును ఈ శ్లోకం ఆవిష్కరిస్తోంది. ఆ విధముగా బ్రహ్మలోకమును వ్యాపించిన శ్రీ మహావిష్ణువు యొక్క పాదపద్మములను బ్రహ్మదేవుడు ప్రక్షాళన చేసిన సందర్భమును పురస్కరించుకుని అన్నమాచార్యులు అందించిన **'బ్రహ్మ కడిగిన పాదము - బ్రహ్మము తాననె పాదము'** అన్న కీర్తన గురు భక్తులందరికీ వర ప్రసాదమే కదా!

**తేజసామపి తేజస్వీ** - అన్న ప్రస్తావనతో అగస్త్యులు 'పెంజీకటి కవ్వల ఏకాకృతితో' వెలిగే పరంజ్యోతి స్వరూపంగా గురుదేవులను వర్ణిస్తున్నారు. గీతాచార్యులు ఈ విషయాన్నే పునరుద్ఘాటిస్తూ **'తేజస్తేజస్వినామహం'** అని శలవిచ్చారు. **'న తత్ర సూర్యోభాతి, న చంద్ర తారకం'** అని ఉపనిషత్తులలో తెలుపబడినట్లు ఆ గురుప్రకాశము నందు సూర్యచంద్రాదుల తేజస్సు

కూడా వెలవెల బోతుందని సాధకుడు గుర్తించాలి. **ఓం తేజస్వినే నమః** - అని శ్రీగురుదేవులను స్తుతించే నామం ద్వారా మనం ఈ భావననే గుర్తించాలి.

**ద్వాదశాత్మన్ నమోస్తుతే** - అంటూ అగస్త్యులు పన్నెండు నెలలలో ప్రకాశించే ద్వాదశాదిత్యులను వర్ణిస్తూ కాల రూపములో భాసించే గురు స్వరూపమును దర్శింప జేస్తున్నారు. ఈ భావననే నిర్ధారిస్తూ జగద్గురువులు విభూతియోగంలో **'కాలః కలయతామహం'** అంటూ నియంత్రించే వాటిల్లో నేను కాల స్వరూపుడనై ప్రకాశిస్తున్నానని తెలియజేశారు. అగస్తులు ఈ శ్లోకము మొదలుకుని **నమోస్తుతే** అంటూ ఆదిత్యునికి నమస్కారములను అందజేస్తూ ఆ ఫలితమును పారాయణ చేసినవారికి అందిస్తున్నారు. విశేషమేమిటంటే ఆదిత్యహృదయం లోని ఈ నమస్కార శ్లోకములు రుద్ర నమకమును తలపిస్తాయి.

ఈ విధంగా లోతుగా పరిశీలిస్తే **విశ్వభావనః** అంటూ విశ్వవిధాతయైన బ్రహ్మాంశను, నక్షత్ర గ్రహ తారాణాం అంటూ త్రివిక్రముడైన విష్ణు అంశను, నమోస్తుతే అంటూ నమక రూపంలో వున్న రుద్రాంశను తెలియజేస్తూ వీటన్నిటికీ మూలమై పరబ్రహ్మ రూపంలో ప్రకాశించే గురుదేవుల యొక్క వైభవమును అగస్త్యులు ఈ శ్లోకము ద్వారా తెలియజేస్తున్నారు.

- సశేషం



# హనుమంతుని తోకలో గంట

(గత సంచిక తరువాయి)                                    సేకరణ - సంతోష్ కుమార్

రామ రావణ యుద్ధం ఘోరంగా జరుగుతోంది. రామలక్ష్మణుల బాణ ధాటికి, కపివరుల ప్రతాపానికి ఎందరో రాక్షస వీరులు రాలిపోయారు. రావణాసురుని కుమారులు కూడా ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇక మిగిలింది ఇద్దరే. రావణుడు, కుంభకర్ణుడు. హాయిగా నిద్రపోతున్న కుంభకర్ణుడు అన్న కోసం యుద్ధరంగానికి వచ్చాడు. కుంభకర్ణుడు మహాకాయుడు. నేలపై నిలబడితే, తల ఆకాశంలోకి వెళ్ళిపోతుంది. అంతటి భారీ దేహం అతడిది. విశాలమైన, ఎత్తైన మహారథంలో కూర్చుని యుద్ధానికి వచ్చాడు. ఆ రథం పైభాగంలో ఉన్న గొడుగుకు చిన్ని చిన్ని గంటలు కట్టివున్నాయి. అవి గలగలా శబ్దం చేస్తుండగా, వికటాట్టహాసంతో వానరులపై విరుచుకుపడ్డాడు కుంభకర్ణుడు. ఘోరమైన పోరు తర్వాత రామబాణం దెబ్బకు నేలకూలాడు. రథం నుండి కిందకు పడుతున్న సమయంలో కుంభకర్ణుడి చెయ్యి తగిలి ఒక గంట క్రింద పడింది. అదే సమయంలో క్రింద యుద్ధరంగంలో వెయ్యిమంది సింగిలీక కోతులు గుంపుగా వెళుతున్నాయి. కుంభకర్ణుని రథం నుండి తెగిన గంట వేగంగా వచ్చి, నేరుగా ఈ కోతుల పైన పడింది. గంటదేమో భారీ ఆకారం. కోతులేమో మరుగుజ్జులు. ఇంకేముంది ఆ వెయ్యి కోతులూ గంట కింద ఇరుక్కుపోయాయి. ఉన్నట్టుండి చీకటి కమ్ముకుంది. ఏ చప్పుడూ వినబడకుండా పోయింది. అంతే, ఆ బుల్లి కోతులకు భయం పట్టుకుంది. అలా కొద్దిసేపు గడిచాక, ఎవరూ తమ కోసం రాకపోవడంతో ఒక్కొక్క కోతి ఒక్కొక్క విధంగా మాట్లాడసాగింది.

“మనల్ని కాపాడ్డానికి ఎవరూ రాలేదు. చచ్చిపోతామేమో?” అని ఒక కోతి అంది. ‘మనం తప్పు చేసాం!” అని మరొక కోతి అంది. ‘అవును, మన రాజు, మంత్రి ఇద్దరూ మూర్ఖులే! వాళ్ళని నమ్మి మోసపోయాం” అని ఇంకొక కోతి అంది. ‘అసలా రాముడు ఎవడు? అతనికి, మనకి సంబంధమేముంది? అయినా వచ్చాం కదా! కనీసం మన గురించి పట్టించుకున్నాడా? మోసగాడు. నమ్మకద్రోహి” అని ఇంకొక కోతి

వదిలింది. "అవునవును' అని వత్తాసు పలికాయి ఎన్నో కోతులు.

అప్పుడు ఒక ముసలి కోతి ముందుకొచ్చి, 'అనవసరంగా ఆడిపోసుకోవడం వల్ల ప్రయోజనం లేదు. సహనంతో ఉందాం. రామ నామ స్మరణ చేద్దాం' అంది. ఆ మాటలకు మిగతా కోతులు కిచకిచా నవ్వాయి. అవహేళన చేసాయి. అయినా సరే, ఆ పెద్ద కోతి కళ్ళు మూసుకుని రామ తారక మంత్రాన్ని జపించడం మొదలుపెట్టింది. ఇంకొంతసేపు గడిచాక, తిట్టి తిట్టి అలసిపోయిన కొన్ని కోతులు ఆ పెద్ద కోతితో చేరి రామ నామాన్ని చేయసాగాయి. అలా అలా కొద్ది కాలంలోనే, అన్ని కోతులు రామ నామ సంకీర్తనలో మునిగిపోయాయి.

ఈలోపు, గంట బైట ఏం జరిగిందో చూద్దాం! రాముడు రావణున్ని సంహరించాడు. సీతమ్మను చేపట్టాడు. విభీషణుడికి పట్టాభిషేకం చేసాడు. ఇక అయోధ్యకు బయల్దేరాలి. అప్పుడు సుగ్రీవుణ్ణి పిలిచి, తన వాగ్దానాన్ని గుర్తు చేసాడు. కపిసైన్యాన్ని లెక్కించి రమ్మన్నాడు. లెక్కలు వేసిన సుగ్రీవుడు రాముడి దగ్గరకు వచ్చి 'ఒక వెయ్యి కోతులు తక్కువగా ఉన్నా' యని చెప్పాడు. మళ్ళీ లెక్కవేయమన్నాడు రాముడు. మళ్ళీ వెయ్యి తక్కువగా వుందన్నాడు సుగ్రీవుడు. అప్పుడు సాక్షాత్తు రామచంద్రుడే బయల్దేరాడు.

ముందు హనుమ దారి చేస్తుండగా, యుద్ధరంగంలోకి వచ్చాడు రాముడు. ఎటు చూసినా రాక్షసుల శవాలు, విరిగిన రథాలు, కత్తులు, పగిలిన డాళ్ళు. వాటన్నింటి మధ్యా ఎక్కడైనా వానరులు పడివున్నారేమో స్వయంగా వెదుకుతున్నాడు రాముడు. అంతలో, స్వామి దృష్టి ఒక గంటపై పడింది. 'హనుమా!' అన్నాడు. పవనసుతునికి తన స్వామి అంతరంగం ఇట్టే అర్థమయింది. వెంటనే తోకను పెంచి గంటను పైకి లేపాడు. అక్కడ ఆ గంట క్రింద, పెదవులపై రామనామం తాండవిస్తుండగా, మూసిన కళ్ళతో, రామభక్తితో వికసించిన మనసులతో కూర్చునివున్న కోతులు. సుగ్రీవుడు చకచకా లెక్కవేసాడు. వెయ్యి సింగిలీక కోతులు. లెక్కసరిపోయింది. చుట్టూవున్న వానర సైన్యం ఒకపెట్టున 'జయ జయ రామ! జయ జయ రఘురామా!' అంటూ జయఘోష చేసింది.

అప్పటి వరకూ చీమ చిటుకుమన్న శబ్దం కూడ వినని

మరుగుజ్జు కోతులు అపార పారావార ఘనఘోర తరంగ ఘోషలా వినబడిన జయజయ ధ్వానాలకు ఉలిక్కిపడ్డాయి. చటుక్కున కళ్ళు తెరిచాయి. చీకటికే అలవాటు పడిపోయిన కళ్ళతో ధగధగా మెరుస్తున్న సూర్యకాంతిని చూడలేక, కళ్ళకు చేతుల్ని అడ్డుపెట్టుకుని, నెమ్మదిగా చూడసాగాయి. అదిగో! ఎదురుగా ఆజానుబాహుడు! అరవింద దళాయతాక్షుడు! నిశాచర వినాశకరుడు! భక్తకోటికి శీతకరుడు అయిన రాముడు నిలబడివున్నాడు.

అంతే. సింగిలీక కోతులు దిగ్భ్రమచెందాయి! దిక్కులు తోచలేదు. ఏం చెయ్యాలన్న ఆలోచన రాలేదు. వానరసైన్యం మరొక్కమారు జయఘోషను చేసింది. 'జై శ్రీరామ! జై శ్రీరామా!' అప్పుడు తెలిసింది ఏం చేయాలో వెంటనే రామపాదారవిందాలపై పడ్డాయి ఆ బుల్లి కోతులు. 'రాముడు మోసగాడు' అన్న ఈ కోతిని, 'హనుమంతుడు బుద్ధిహీనుడు' అన్న ఆ కోతిని తాకాయి రామస్వామి మృదు హస్తాలు. ఎవరి వీక్షణం భవసాగరాన్ని తారణం చేయిస్తుందో అటువంటి రామ వీక్షణం 'తారక మంత్రమే త్రోవ' అన్న పండుకోతిపై ప్రసరించాయి. అలా సింగిలీక కోతుల జన్మలు ధన్యమయ్యాయి. ఇప్పుడు రాముని దృష్టి హనుమ వైపుకు మళ్ళింది.

**సుందరో వానరః కపిః** ముద్దైన కోతి తోకకు ముచ్చటైన గంట. మురిపెంగా చూసాడు ముగ్ధమోహనుడైన రాముడు. 'హనుమా! రాముడు మాట తప్పడు అనడానికి ఉదాహరణగా నిలిచే ఈ సింగిలీక కోతుల కథకు గుర్తుగా, తోకతో గంటను కలిగిన నీ రూపాన్ని ఎవరు చేతులారా అర్చిస్తారో, మనసారా ప్రార్థిస్తారో, వారికి నా అనుగ్రహం రెండింతలుగా లభిస్తుంద'ని వరమిచ్చాడు శ్రీరాముడు. వాలంలో ఘంటను కలిగిన వానరశ్రేష్టుణ్ణి దర్శించేప్పుడు, పూజించేప్పుడు ఈ సింగిలీక కథను గుర్తుచేసుకోండి. 'సింగిలీక వరదా శ్రీరామచంద్రా!' అని ప్రార్థించండి.

**జయజయ ఆంజనేయ! జయజయ శ్రీరామ!**

**శ్రీరామ జయరామ! జయజయ రామ!**

(గత సంచిక తరువాయి) **సర్వ సమర్పణ** - ఎన్. కుట్టీ

ఆ వేశ్య మాటలకు వృద్ధ దంపతులు సమ్మతించారు. అప్పుడు యాత్రికులు వారిలోవారు 'మనం కూడా ఏ పాపం చేయలేదు. శ్రీశైలం వెళ్ళి శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకుని వచ్చాము. కానీ ఆ దంపతులు మనలను కనీసం రక్షించమని అడగలేదు. ఇంత వయస్సు వచ్చి, ప్రాణాలు పోతున్నా, ఆ ముసలివాడికి ఆ వేశ్య మీద ఎంత ప్రేమ! ఆ ముసలిది తన భర్తకు తానాతందాన అంటోంది. వేశ్య వృత్తి చేయడమెంత తప్పు! ఒక ప్రక్క వేశ్య వృత్తి చేస్తూ, ధైర్యంగా తాను పవిత్రురాలినని, తన మనస్సు సదా భగవంతునియందే వున్నదని, తను మనో ధనాలను ఆ సర్వేశ్వరునికే అర్పించానని ఎంత చక్కగా అబద్ధం ఆడుతోంది! ఆ మాటలు ఆ ముసలి దంపతులు నమ్మితే నమ్మవచ్చు. కానీ మేము నమ్మం. ఆ వేశ్యకన్నా మేమే నీతి పరులం' అని ఆ దంపతులతో మేము కూడా మిమ్మలను ఊబిలో నుండి బయటకు తీయగలం' అనగానే, ఆ దంపతులు మీ ప్రయత్నం మీరు చేయండి. భగవదేచ్ఛ ఎలా వుందో!' అన్నారు. వారు ఒప్పుకోవడమే తడవుగా యాత్రికులు ప్రయత్నించారు. ఇంతమంది కలిసి లాగుతున్నా కూడా వారిద్దరిని బయటకు తీయలేకపోయారు. వారందరికీ నీరసం వచ్చి క్రింద పడిపోయారు.

అప్పుడా దంపతులు ఆ వేశ్యతో 'అమ్మా! నీవు కూడా మమ్మల్ని బయటకు తీసే ప్రయత్నం చెయ్యి' అన్నారు. యాత్రికులంతా చూస్తుండగానే, ఆ వేశ్య ఆ వృద్ధ దంపతులను అతి సునాయాసంగా ఊబి నుండి బయటకు లాగివేసింది. తక్షణమే ఆ దంపతులు 'ఓ యాత్రికులారా! మొదట మీలో మీకే సందేహం కలిగి, పాపం చేశామనే భావనతో మీ తను మనో ధనాలను భగవంతునికి అర్పించలేదు కనుకనే, మమ్మల్ని రక్షించడానికి మీ మనస్సు అంగీకరించలేదు. మీరు సంకోచించారు. కానీ, ఈ వేశ్య ముందుకు వచ్చి, తాను ఏ పాపమూ చేయలేదనీ, సర్వస్వమూ సర్వేశ్వరుడికి అర్పించాననీ, తనకు భగవంతుడు తప్ప వేరు లేదని చెప్పేసరికి మీలో అహంకారము, అసూయ ప్రబలి, మీ మనస్సులో ఆమె ఒక వేశ్య అని, ఆమె జీవితం పాపాల పుట్ట అని, ఆమె చెబుతున్నదంతా అసత్యమనీ మీరంతా భావించారు. మరి

మీరు పుణ్యాత్ములే అయితే, ఏ పాపమూ చేయని వారే అయితే మమ్మల్ని ఎందుకు బయటకు లాగలేకపోయారు? చూశారా! ఆమె వేశ్య అయినప్పటికీ, మనస్సు భగవంతునిపై వుంచినది కనుక గాఢమైన విశ్వాసంతో, భగవంతుడే తనచేత చేయిస్తున్నాడని తలచి, మమ్మల్ని ఊబి నుంచి బయటకు తీయడానికి ప్రయత్నించింది. ఆ నమ్మకము చేతనే మమ్ములను బయటకు తీయగలిగినది.

అమ్మా! మేమిద్దరమూ శివ పార్వతులము. ఈ రూపంలో వచ్చాము. నీ భక్తికి మెచ్చాము. నిన్ను తరింప జేయడానికే మేమింత నాటకం ఆడవలసి వచ్చింది. నీకిదే ఆఖరి జన్మ. నీ శేష జీవితాన్ని భగవంతుని సేవలో గడిపి, అంత్య కాలంలో మాలో చేరుకుంటావు!' అని చెప్పి అదృశ్యమైనారు ఆ వృద్ధ దంపతుల రూపంలో వచ్చిన పార్వతీ పరమేశ్వరులు!

### పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**మార్చి 2022**

1 మంగళ - మహాశివరాత్రి - శ్రీసద్గురుపాదపూజ

18 శుక్ర - ఫాల్గుణ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

27 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2022**

2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది - శ్రీసద్గురుపాదపూజ

10 ఆది - శ్రీరామ నవమి - శ్రీ సద్గురు పాదపూజ

16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.

25 సోమ - శ్రీ గురుదశమి - శ్రీసద్గురు పాదపూజ.

# మాఘమాస ప్రాశస్త్యం

- సుషమ్నా ప్రసాద

తెలుగు కాలమాన ప్రకారం మాఘమాసం 11వ మాసం. మనకు ఆరు ఋతువులున్నాయి. ఒక్కొక్క ఋతువుకు రెండు మాసాలు. ఈ మాఘ మాసం శిశిర ఋతువులో వస్తుంది.

కాలం అమూల్యమైనది. భగవంతుడు కాలాన్ని సద్వినియోగ పరచుకుని, తరించడానికే మనకీ  కాలాన్ని ప్రసాదించాడు. **కాలం కలయతామహం** అని అంటే కాలం కేవలం భగవత్స్వరూపమే. అందులో కొన్ని మాసములకు కొన్ని ప్రత్యేకతలు వున్నాయి. అలాంటి విశిష్ఠత గల మాసము ఈ మాఘమాసము. పేరులోనే ఆ విశేషం గోచరిస్తోంది. 'అఘము' అంటే పాపము.  'మ' అంటే రహితం చేసేది. అంటే పాపరహితం చేసుకోవడానికి ఈ మాఘమాసం దోహదం చేస్తుంది. అలాగే మాఘమాసము అంటే మాసములలో ఘనమైనది అని అర్థం. శుభకార్యాలు చేయడానికి నిలయమైనది. ఈ మాసానికి ముందు వచ్చేది పుష్యమాసము. దీనిని శూన్యమాసము అంటారు. ఈ మాసంలో శుభకార్యాలు చేయరు.

మాఘమాసంలో వచ్చే పంచమిని వసంత పంచమి అంటారు. వాగ్దేవి సరస్వతీమాత జన్మదినంగా వసంత పంచమి పరిగణింప బడుతోంది. మాఘ శుద్ధ సప్తమి సూర్యభగవానుని ఆరాధించే రథ సప్తమిగా ప్రసిద్ధి చెందినది. సూర్యకాంతి ఈ రోజు నుండి ద్విగుణీకృతమై, దినదిన ప్రవర్ధమానంగా వృద్ధి చెందుతుంది. సప్తాశ్వములను అధిరోహించి, జగత్తును జ్వాజ్వల్యమానంగా ప్రకాశింప జేస్తూ స్వచ్ఛమైన హరివిల్లుగా మన హృదయాలను పులకరింపచేస్తుంది. సప్తాశ్వములు ఏడు రంగుల హరివిల్లు (ఇంద్రధనుస్సుకు) ప్రతీకగా నిలుస్తాయి.

చంద్రమానం ప్రకారం ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేది ఈ మాఘమాసములోనే! అందుచేతనే కురుక్షేత్ర సంగ్రామంలో అంపశయ్య మీద ఉండి భీష్మాచార్యులు పవిత్రమైన మాఘమాసం కోసం ఎదురు చూశారు. వారికి స్వచ్ఛంద మరణమనే వరమున్నది. కనుకనే మాఘ శుద్ధ అష్టమి నాడు తనువు చాలించారు. మాఘ శుద్ధ అష్టమి

భీష్మాష్టమిగా ప్రసిద్ధి చెందినది. మాఘ శుద్ధ సప్తమి మొదలుకొని ఏకాదశి వరకు వున్న ఆ అయిదు రోజులను భీష్మ పంచకము అంటారు. ఆ రోజున నారాయణార్చన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, జపతపాలను, ఉపవాసాలను చేస్తారు. భీష్మ నిర్యాణానంతరం వచ్చిన ఏకాదశి కనుక ఈ భాగవత శిఖామణి పేరు మీదుగా ఈ ఏకాదశిని భీష్మఏకాదశి అని పిలుస్తారు.

ఇక మాఘపూర్ణిమ గురుపూర్ణిమగా, వ్యాసపూర్ణిమగా గురు పుత్రులకు, మంగళప్రదమైన రోజు. **వ్యాసో నారాయణో హరిః** అన్నారు. వ్యాసమహర్షి కేవలం నారాయణ స్వరూపము. 'వ్యాస' అంటే విశాలము, వ్యాప్తమైనది అని అర్థము. అంటే నారాయణ స్వరూపమైన వ్యాసమహర్షి విశ్వ వ్యాపకుడు, విశ్వరక్షకుడు, విశ్వ శాంతిని ప్రసాదించేవాడు. అటువంటి గురుతత్త్వముతో నిబిడీకృతమై, గురు పుత్రులకు కల్పవృక్షము వంటిది ఈ గురుపూర్ణిమగా విరాజిల్లే మాఘపూర్ణిమ. **'గు'కారో అంధకారస్య, 'రు'కారో తన్నిరోధకః** అని, అజ్ఞానమనే అంధకారమును పారద్రోలి, జ్ఞానమనే దివ్యకాంతిని, అమృత బిందువులుగా వర్షింపజేసి, తన్నాశ్రయించిన శిష్యులను తన అక్కున జేర్చుకుని, అలరింపజేసే ప్రేమ స్వరూపుడు గురుదేవుడు. త్రికరణ శుద్ధిగా గురుపరమాత్మను నమ్మి, అచంచలమైన విశ్వాసముతో సద్గురునామ స్మరణ చేస్తూ, గురుపాద పద్మములను ఆశ్రయించిన భక్తులకు చేదోడువాదోడుగా కాపాడుతారు. అదే విషయాన్ని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో నొక్కి వక్కాణిస్తారు

**అనన్యాశ్చింతయన్తోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥**

'ఎవరైతే యితర చింతనలు లేకుండా నన్నే పూర్తిగా ఆశ్రయిస్తారో వారి యోగక్షేమాలను నేనే చూసుకుంటాను' - అని శెలవిచ్చాడు భగవానుడు.

అందుచేతనే సద్గురు నామస్మరణ, సద్గురుపాదసేవ భక్తులకు శిరోధార్యము. శ్రీబాబూజీ ఎప్పుడూ బోధిస్తూ వుండేవారు - ఘటము పూర్తిగా నీటితో నిండివున్నప్పుడు ఒక్కబొట్టు నింపడానికికానీ, తీయడానికి గాని సాధ్యముకాదు. అలాగే శిష్యుని హృదయము పూర్ణ పాత్రగా శోభిల్లాలి. పరిపూర్ణమైన గాఢమైన విశ్వాసంతో నిండి వుండాలి. అప్పుడు హృదయంలో సందేహాలు సంకల్పాలనే ఒక్క నీటి బొట్టు కూడా

చేరడానికి వీలుండదు. హృదయమంతా సంపూర్ణ భక్తివిశ్వాసాలతో పూర్ణ పాత్రగా శోభిల్లుతుంది. ఎలాగైతే పూర్ణిమనాడు పూర్ణచంద్రుడు సంపూర్ణమైన చల్లని కాంతితో శోభిల్లుతుంటాడో, మన హృదయాలను రంజింపజేస్తుంటాడో అలాగే గురుదేవుడు దివ్యానుగ్రహమనే తన కాంతిని మన హృదయాలలో ప్రవేశపెట్టి, అజ్ఞానమనే చీకటిని తొలగించి, తనను ఆశ్రయించిన వారందరినీ పూర్ణచంద్రునిలా పరిణతి చెందేటట్లు చేస్తాడు. మనస్సు సంకల్ప రహితమై, భక్తి వైరాగ్యాలనే కిరణాలతో పూర్ణచంద్రోదయమయిన ఘటములోని జలముతో, గురునాధుని చరణ కమలమునకు ప్రక్షాళనము చేయడమే గురుభక్తుని లక్ష్యార్థము. అలా సేవించడమే గురుభక్తుని పరమావధి. మాయకు దూరం చేసి, మాధవుని పాదపద్మములలో పరమాణువుగ లయింప జేయడానికి దోహదము చేసేదే ఈ మాఘపూర్ణిమ ప్రత్యేక విశిష్ఠత.

అలాగే మాఘమాసం ముగింపులో మహాశివరాత్రి పర్వదినం వస్తుంది. ఆ పర్వదినం మానవాళికి మహోదయం. 'శివ' అంటే మంగళ స్వరూపమని సంకేతము. 'రాత్రి' అంటే చీకటి అని అర్థం. అజ్ఞానమనే చీకటిని పారద్రోలి, మానవుని మంగళ స్వరూపునిగా చేయగల సమర్థత మహాశివునికి మాత్రమే వున్నది. అందుచేతనే అంధకారమును పారద్రోలి శశిధరునిగా ప్రకాశింపజేసే పరమశివుడు మానవులను తరింప జేయటానికి ప్రసాదించే మహోదయమే మహాశివరాత్రి. అందుచేతనే శివరాత్రినాడు చీమయినా తరిస్తుంది అంటారు. పరమ ప్రేమమూర్తియైన పరమశివుడు, సంకల్పములు, విషయవాంఛలను, కోరికలనే గరళముతో సంకుచితమైన మానవాళి హృదయములలోని హాలాహలమును తన కంఠసీమనందు అలంకరించుకుని నీలకంఠునిగా వినుతిచెందాడు. త్రిగుణాలను హరించే త్రినేత్రునిగా శోభిల్లుతున్నాడు. అలాంటి పరమ ప్రేమస్వరూపుడైన పరమ శివుని ప్రేమకు పాత్రులము కావడమే మన జీవిత పరమావధి. అలాంటి మహాశివరాత్రి పర్వదినం కూడా ఈ మాఘమాసంలో వస్తుంది. కనుక శివకేశవుల ఏకత్వమునకు తార్కాణమైన మాఘమాసము, నిత్యమాఘమాసమై, గురుపుత్రులను తరింపజేయునది కదా!

# పుస్తక జ్ఞానం - అనుభవ జ్ఞానం

- డా॥ పి. సుధారాణి

మన సద్గురుదేవులు అనుభవ జ్ఞానం మరియు పుస్తక జ్ఞానానికి వున్న భేదం వివరిస్తూ ఇలా చెప్పేవారు. 'ఒక వ్యక్తి మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. పుస్తక జ్ఞానమేకానీ, అనుభవజ్ఞానం లేని ఒక స్నేహితుడిని సహాయంగా తీసుకుని వెళ్ళాడు. ఆ స్నేహితుడు మద్రాసు బేసిన్ బ్రిడ్జి స్టేషన్‌లో దింపాడు. బేసిన్ బ్రిడ్జ్ స్టేషన్ మద్రాసు స్టేషన్ కంటే ఒక స్టేషన్ ముందుగా వస్తుంది. ఆ వ్యక్తి దిగాక ఏమీ చేయలేక సామాన్లు మోసుకుంటూ మద్రాసు స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్ళవలసి వచ్చింది. అదే అనుభవజ్ఞానమున్న స్నేహితుడయితే సరిగ్గా మద్రాసు స్టేషన్‌కి తీసుకెళ్ళి దింపుతాడు కదా!' అని వివరించారు.

ఇటీవల అటువంటి సంఘటనే నా జీవితంలో జరిగింది. మా వారు డా॥ లక్ష్మీనారాయణ CPR Training గురించి అన్ని ప్రాంతాలకు వెళ్తూ వుంటారు. భువనేశ్వర్ దగ్గర థామ్రా అనే ఊరికి (భద్రక్ తాలుకా) వెళ్తుంటే, పూరీ, కోనార్క్ క్షేత్రయాత్ర కూడా చేయవచ్చని, నేను కూడా మా వారితో బయలుదేరాను. భువనేశ్వర్‌కి విమానంలో వెళ్ళి, అక్కడి నుండి కంపెనీ వారి కారులో వెళ్ళాలి. మేము పొద్దుట 9గంటలకు భువనేశ్వర్ చేరాము. భువనేశ్వర్ నుండి భద్రక్ సుమారు 3గంటల ప్రయాణం అని తెలిసింది. పగలు 10గం. నుండి 4గం.ల వరకూ భువనేశ్వర్‌లోని ముఖ్యమైన ఆలయాలు దర్శించుకుని, సాయంత్రం 4గం.లకు బయలుదేరి రాత్రి సుమారు 7గం. ప్రాంతంలో అక్కడకు చేరుకుంటే సరిపోతుందిలే అనుకున్నాము. ఆ మరునాడు మా వారి ట్రయినింగ్ ప్రోగ్రామ్ కాబట్టి ఆ విధంగా ప్లాన్ చేసుకున్నాము.

భువనేశ్వర్‌లో లింగరాజు ఆలయం, రామేశ్వరాలయం, బ్రహ్మేశ్వరాలయం మొదలగు ఆలయాలను దర్శించి, 4గం. కంపెనీ వారి కారులోనే బయలుదేరాము. వారు ఇచ్చిన అడ్రెస్‌లో J.J gp Hotels and Resorts అని వున్నది. ఆ చిరునామా ప్రకారం మా వారు GPS పెట్టుకున్నారు. కానీ అది J.J gp Hotels మాత్రమే. Resorts ఇంకో దారిలో వుంది. డ్రైవర్‌ది ఒరియా భాష. ఇంగ్లీషు, హిందీ రాదు. హైవే రోడ్డు అంతా రిపేర్‌లో వుండటంతో దారి అసలు బాగోలేదు. మా వారు

చూసుకుంటే ఇంకో దారి చూపిస్తోంది. డ్రైవర్ దారిలో వెడుతున్నాడని మా వారికి ఖంగారుగా వున్నది. డ్రైవర్‌కి కొత్త కాబట్టి యజమాని చెప్పిన దారిలో వెళ్తున్నాడు. ఫోన్ చేసి కనుక్కుంటున్నాడు. ప్రయాణం 3 గంటలకు బదులుగా 6గంటలు పట్టింది. చలికాలం, త్వరగా చీకటి పడుతున్నది. గతుకుల రోడ్డు. రాత్రి 9గంటలు అయింది. మా వారు ట్రావెల్స్ ఓనర్‌కి, కంపెనీ మేనేజర్‌కి ఫోన్‌చేసి మాటిమాటికి ఖంగారుగా ఫోన్ చేస్తున్నారు. వాళ్ళు 'మీరేమీ ఖంగారు పడవద్దు. డ్రైవర్ కరెక్టుగానే తీసుకుని వెడుతున్నాడు' అని చెప్పారు. అయినా మా ఆయనకి మాత్రం నమ్మకం కుదరటం లేదు. ఎందుకంటే GPS తప్పు చూపించదు కదా! అని. అప్పటికే 6గంటల ప్రయాణం అయింది. ఒక వేళ రూట్ తప్పుఅయితే తిరిగి వెళ్ళడానికి ఎన్ని గంటలు పడుతుందో అని మా వారి భయం! నాతో 'నీకేమీ పట్టదు. సెల్‌ఫోన్‌లో ప్రవచనాలు వింటూ కూర్చుంటావు!' అన్నారు. నేను 'డ్రైవర్ ఫోన్‌లో దారి కనుక్కుంటూనే వెడుతున్నాడు కదా అని నిర్భయంగా వున్నాను' అని సమాధానం చెప్పాను. చివరికి డ్రైవర్‌దే కరెక్ట్! హోటల్ బయట J.J gp Hotels అని వ్రాసి వుంది అంటే J.J group లో Hotels మరియు Resorts కూడా వున్నాయి. మేము వెళ్ళవలసినది హోటల్స్ కే కానీ రిసార్ట్స్‌కి కాదు. కొత్తగా వెళ్ళే మా లాంటి వాళ్ళకి తెలియక J.J gp Hotels and Resorts అని GPSలో పెట్టుకున్నాము. అనుభవ జ్ఞానం వున్న ట్రావెలర్ ఓనర్స్ ఇంకా కంపెనీ మేనేజర్ చెప్పింది, అంటే డ్రైవర్‌ని కరెక్ట్‌గా గైడ్ చేశారు.

మాతో వచ్చిన మావారి స్టాఫ్ మా వారితో 'మేడమ్‌గారు ఇంత స్థిరంగా వున్నారు. నా జోహార్లు' అని.

**WHY FEAR? I AM HERE!** అనే సద్గురుదేవుల దీవెనలను విశ్వసించిన వారికి లోటేముంది? అని నేను మనస్సులోనే బాబుకి నమస్కరించుకున్నాను.


అప్పుడు
మధుప
ఓ పండితులారా! మీ ప్రతిభ వల్లన మా సభకు ఎంతో గౌరవం పెరిగింది. ఈ కానుకలు స్వీకరించండి.
1
చూశావా, రాజుగారికి మనమంటే ఎంత అభిమానమో!
2


తమవంటి మహాత్ముల రాకతో మా రాజ్యం పావనమైంది స్వామీ!
3
చూశావా, ఆ సన్యాసికి రాజుగారు ఎంత గౌరవం ఇస్తున్నారో? ఇవాళ ఆయన వచ్చేసరికి మన ప్రతిభ అంతా కనబడకుండా పోయింది. ఈ రాజులు ఎప్పుడూ ఇంతే!
4


మహారాజా! మహారాజా! పొరుగు రాజ్యం రాజుగారు మన మీదికి దండెత్తి వస్తున్నారు.
5


ఆ రాజుగారు మన రాజుగారికంటే చాలా బలవంతుడు. ఇంక మనం ఈ రాజ్యంలో ఉండటం క్షేమం కాదు. పదండి పోదాం.
6


ఓ మహాత్మా! ఈ
ఆపత్కాలంలో
తమరే నాకు
మార్గదర్శనం
చెయ్యగలరు.
నేను చెప్పినట్లు
చెయ్యండి
మహారాజా! మీకంతా
శుభమే
జరుగుతుంది.
7


తమ మార్గదర్శనంలో నేను
శత్రువులను జయించాను
మహాత్మా! ఆపత్కాలంలో
ఆదుకున్న తమరే నిజమైన
ఆప్తులు. అంతా
బాగున్నప్పుడు తోడుగా ఉండి
ఆపద రాగానే
కనుమరుగైపోయే వారు
కపటులు.
8

# సుందర గీత

- జగన్నాథ ప్రసాద్

రాముడు గొప్పా? రామనామం గొప్పదా? రామనామమే గొప్పదని చెప్పాలి! దీపాన్ని, దీపకాంతిని మనం విడదీయలేము. కానీ మనం నేరుగా ఉపయోగించేది దీపకాంతినే కాబట్టి, దీపకాంతియే గొప్పదని చెప్పవచ్చు.

సముద్రందాటి వెళ్ళడానికి వానరసేన రాళ్ళతో వారధి నిర్మిస్తున్నారు. వానరులందరూ దూరంగా వున్న రాళ్ళను తెచ్చి, 'జై శ్రీరామ్!' అంటూ మనసారా స్మరిస్తూ, బిగ్గరగా ఉచ్చరిస్తూ నీటిలో వదులుతున్నారు. ఆశ్చర్యం! అవి బరువును కోల్పోయి, బెండుముక్కల లాగా నీటిపై తేలాయి. వానరులు రాళ్ళు వేయడం, అవి నీళ్ళపై తేలడం రాముడు గమనించాడు. తను కూడా ఆ వారధి నిర్మాణంలో పాలు పంచుకుని, వానరులకు సహాయం చేద్దామని, రాముడు కూడా ఒక రాయి తీసుకుని నీటిలో వదిలాడు. విచిత్రం!! అది నీటిలో మునిగిపోయింది. ఇంకొక రాయి వేశాడు. అదీ అంతే! ఏమిటీ వింత? వానరులు వేసినవి తేలుతున్నాయి, తాను వేసినవి మునుగుతున్నాయి!

హనుమంతుని పిలిచాడు. 'హనుమా! మీరు వేసే రాళ్ళు తేలుతున్నాయి, నేను వేసినవి మునుగు తున్నాయి. ఏమిటీ విపరీతం?' అని అడిగాడు. 'రామచంద్ర ప్రభూ! అదేమీ విపరీతం కాదు. వానరులంతా మీ నామాన్ని భక్తితో, విశ్వాసంతో ఉచ్చరిస్తూ రాళ్ళను వదిలారు. అవి రామనామ మహిమతో తేలికపడి, నీటిపై తేలాయి. కానీ, మీ నామం చేయకుండా రాళ్ళు వేస్తే అవి మునుగుతాయి' అని మీరే సంకేతం ఇచ్చారు. ఇదే రామనామ మహిమ. ఇంతకంటే వేరే కారణం ఏమీ లేదు ప్రభూ! జై శ్రీరామ్!' అంటూ హనుమ విన్నవించాడు.

'గీత' అనే యువతిని సృష్టిలోని అందాన్నంతా రంగరించి, బ్రహ్మదేవుడు ఆమెను ప్రత్యేకంగా తయారు చేశాడా అన్నట్లుగా వుంది. ఒక యువకుడు ఆమెను చూసి, ఆ అందానికి పరవశుడయ్యాడు. 'ఓ జవ్వనీ! నా పేరు సుందరుడు. నీవెవరవో, నీ పేరు ఏమిటో, నీ ఊరు ఏమిటో నాకు అనవసరం. దయచేసి నన్ను వివాహమాడు' అని

వేడుకున్నాడు. 'నిన్ను వివాహమాడాలా! ఎందుకు?' పరిహాసంగా అడిగింది. 'నీవు అద్భుత సౌందర్యరాశివి. నిన్ను వివాహమాడినవాడు అదృష్టవంతుడు. అది నేనే కావాలనుకుంటున్నాను. జీవితాంతం నీకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకునే బాధ్యత నాది. ప్రమాణం చేస్తున్నాను. నన్ను విశ్వసించు. దయచేసి కాదనకు' అని ప్రాధేయపడ్డాడు.

'నేను సౌందర్యరాశిని అంటున్నావు, కాబట్టి వివాహమాడమని అడుగుతున్నావు. ముందుముందు నా కంటే సౌందర్యవతి ఇంకొకరు తారసపడితే ఆమెను కూడా ఇలాగే అడుగుతావా?' అన్నది గీత. 'అసంభవం! నీకంటే సౌందర్యరాశి మరొకతె ఉండదు, ఉండబోదు' అన్నాడు సుందరుడు.

'నీవు పొరబడుతున్నావు. నా సృష్టికి కారకుడు శ్రీకృష్ణ పరమాత్మ. మధురానికే మధుర స్వరూపుడు. ఆ నీలమేఘశ్యాముని అందాన్ని వేలాదిమంది గోపికలు తమ మనస్సులో బంధించారు. అతగాడు సుందరాకారుడు మాత్రమే అనుకుంటున్నావేమో, రాజ్యాలను ఏలని రాజాధిరాజు. సుగుణోత్తముడు. కొంటెవాడు. చిలిపివాడు. అతి బాల్యంలోనే అనేకమంది రాక్షసులను అవలీలగా సంహరించిన వీరాధివీరుడు. 'మన్నుతిన్నావా?' నోరుతెరవమని కోపించిన యశోదకు తన నోటిలో సర్వసృష్టిని, అద్భుతమైన విశ్వరూపాన్ని చూపించాడు. ఆమె జన్మ ధన్యమైనది. పరమాత్ముడని నమస్కరించాలా! పసివాడని దీవించాలా! అని తబ్బిబ్బయ్యింది. ఎక్కడ దిష్టి తగులుతుందోనని దిష్టి తీసింది. పరంధాముడికి దిష్టి తీయడమా! అవసరమా? కానీ, అది తల్లి మనస్సు కదా! మహాత్ముడయినా తల్లికి బిడ్డడే. పురుషోత్తముడు.

యుద్ధాలు చేయకపోయినా, యుద్ధకళ తెలిసినవాడు. రాజ్యాలు ఏలకపోయినా, రాజనీతినెరిగినవాడు. యుద్ధం వలన అపార ప్రాణనష్టం జరుగుతుంది కాబట్టి, కురుపాండవుల మధ్య యుద్ధం ఆపడానికి రాయబారిగా వెళ్ళి సంధిని నెరపాడు. కానీ, వినాశకాలం దాపురించిన దుర్యోధనుడికి పరమాత్ముని మాటలు రుచించలేదు.

బావ అర్జునుడికి రథసారథిగా వుండి, తాను ఆయుధం పట్టకుండా, అర్జునుడితో యుద్ధం చేయించాడు శ్రీకృష్ణుడు.

శత్రుసైన్యంలో తన బంధువులను చూసి, భీతిల్లి, యుద్ధం చేయనన్న అర్జునుడికి హితబోధ చేశాడు. 'నీ చేతిలో ఏమీ లేదు. నీవు నిమిత్త మాత్రుడవు. చేయించేది అంతా నేనే. జన్మించిన వానికి మరణం తప్పదు. యుద్ధభూమిలో చనిపోతే అది వీరమరణం అవుతుంది. ఆ వీర మరణం వారికి కలిగించు' అని బోధించి, అర్జునుడిని యుద్ధోన్ముఖుణ్ణి చేసి, పాండవ విజయానికి కారకుడయ్యాడు.

పదునెనిమిది రోజులు యుద్ధ భూమిలో అర్జునుడికి జీవిత సత్యాలు తెలిపి, జీవ కర్తవ్యాలను వివరించి, ధర్మబోధ చేసి, తన విశ్వరూపాన్ని చూపించాడు. కురుక్షేత్ర రణభూమిలో అర్జునుడికి పరంధాముడు చేసిన వుపదేశ సారమే నేను, ఆ గీతకు భగవద్గీత అను నా సుందర రూపము. పరంధాముడు పలికిన పలుకులు పసిడి ముద్దలే కదా. ఇప్పుడు విచక్షణ కలిగి ఆలోచించు. నేను సౌందర్యవతినా? నా సృష్టికి కారకుడయిన ఆ పురుషోత్తముడు కృష్ణ పరమాత్ముడు సుందరుడా?

కృష్ణుడు జగదేక సుందరుడు, సకల సద్గుణ సంపన్నుడు, మధురాధిపతి. నా కంటె మిన్నగా ఆ జగన్నాటక సూత్రధారి గోవిందుడిని భక్తితో, ఆర్తితో ప్రేమించు, పూజించు, ఆరాధించు. సంకల సంపదలకు నీవే అధిపతివి అవుతావు. నీ మనస్సు సుందర రూపం దాలుస్తుంది. ఇక ఏ సుందరీ నీ మనస్సులోకి రాదు' అని గీత పలికింది.

ధన్యోస్మి! గీతామాతా ధన్యోస్మి! నా అజ్ఞానాన్ని మన్నించు. నా కళ్ళు తెరిపించావు. చక్కని జ్ఞానబోధను ప్రసాదించావు. నీకు సర్వదా కృతజ్ఞుడిని. నీవు చెప్పినట్లుగా ఆ కన్నయ్య మాత్రమే పురుషోత్తముడు, మధురాధిపతి, జగదేక సుందరుడు. ఇక నా మనస్సులో వెన్నదొంగనే సుస్థిరంగా ప్రతిష్ఠించి, ఆరాధిస్తాను. నమోస్తు గీతామాత!

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

అనుభవ సాధనాలైన ఇంద్రియాలు లేనప్పుడు అక్కడ ఏమాత్రమూ దుఃఖ ఛాయలు వుండవు. మనసు లోని విక్షేపాలే దుఃఖ కారణాలు. ఇంద్రియాలు, వాటి కదలికలు (విక్షేపాలు) ఎక్కువైన కొద్దీ దుఃఖం ఎక్కువ అవుతూ వుంటుంది. అవి తగ్గుతూ వుంటే దుఃఖం కూడా తగ్గుతూ వుంటుంది. ఆ శుద్ధ చైతన్య అవస్థను చేరుకోగానే మనస్సును పూర్తిగా దాటిపోతాము. ఎక్కడ మనస్సు లయమవుతోందో అక్కడ సమస్త అమంగళాలు కూడా అంతం అవవలసినదే. ఆత్మ - శివ రూపం - మంగళ రూపం. ఉపనిషత్తులలో చెప్పబడిన ఆ పరమాత్మ తత్త్వాన్ని గురువులు మనకు అలవోకగా అందిస్తున్నారు. ఇక్కడ ఈ ఉపనిషత్తు మంత్రంలో బ్రహ్మదేవుడు గురు స్థానంలో వుండి తమ స్వానుభవాన్ని తెలియజేశారు.

సత్య వస్తువు తత్త్వం ఆది మధ్యాంత రహితమైనది అని. ఈ నర్మదేశ్వరస్వామి మనచేత ఈ ఉపనిషత్ ఉపాసన చేయిస్తున్నాడు. సమయం పాటిస్తూ, ఆ సమయంలోనే మనం దానిని విచారణ చేస్తూ దాని అనుభవాన్ని పొందుతున్నాము. తత్వానుభూతిలో మనస్సు మునిగిపోతోంది. మళ్ళీ లేస్తూ వుంది. పూర్తిగా మునిగిపోతే ఇహ మాటలే రావు. నీటిలో మునిగిపోయినవాడు 'రక్ష రక్ష' అని గొంతు దాకా మునిగే వరకూ అనగలడు. మహా అయితే చెయ్యి పైకి ఎత్తి చూపించగలడు.

ఈ భవసాగరం భయాన్ని కలిగిస్తుంది. కానీ, మనం బోధామృతం అనే మహానదిలో వున్నాం. ఇది ఎప్పటికీ ఎండిపోయేది కాదు. ఇది అఖండ ప్రవాహం. మనందరం మహాత్ముల బోధ అనే అమృతాన్ని పానం చేస్తున్నాం. ఇహ మనకి భయమెక్కడిది?

21వ మంత్రం గురించి వ్యాఖ్యానిస్తూ శ్రీ మాతాజీ ఈ విధంగా వివరించారు. ..........

'నేను' అనే దానికి అంటే ఆత్మకు కాళ్ళూ చేతులు (అపాణి పాదః) లేవు. అంటే ఆలోచించడానికిగానీ, గ్రహించడానికి గానీ శక్యంగాని ఒక

అచింత్యమైన శక్తి. అది పరిపూర్ణమైనది. మనసుని, బుద్ధిని కూడా అధిగమించినప్పుడే దాన్ని అనుభవం ద్వారా తెలుసుకోగలం.

ఆ 'నేను' నేత్రములు లేకుండానే చూస్తుంది. చెవులు లేకుండా వింటుంది. నేను ఎల్లప్పుడూ చైతన్య స్వరూపుడను. దానిని తెలుసుకోవడమే జ్ఞానము.

మనం కళ్ళు మూసుకుని కూర్చున్నా, మనస్సు ఇంకొక సృష్టి చేస్తుంది లోపల. ఊహాపోహాది విచక్షణతో సృష్టించుకుంటాం. ఇదంతా మాయ, భ్రమ అని మనస్సులో కలిగిన మాయ అని బుద్ధికి కూడా తెలుసుకునే శక్తినిచ్చేది ఆ చైతన్య స్వరూపమే. ఇంద్రియాలన్నిటినీ పని చేయించే శక్తే ఆ 'నేను'. ఈ సృష్టిలో ప్రతిదానిని ప్రకాశింపజేస్తుంది. సృష్టిని నడిపించి తనలో లయం చేసుకుంటుంది. దానిని ఆత్మ అని కూడా అంటారు.

- సశేషం



**ముఖ్య గమనిక**

మే నెలలో సంకల్పించిన శ్రీకాళీవనాశ్రమ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రస్తుత కరోనా పరిస్థితుల దృష్ట్యా నవంబర్ నెలకు మార్చబడినవి. మరిన్ని వివరాలు తరువాత తెలియజేయబడును.

# నాదబిందు కళలు

- పాలూరి కాళీప్రసాద్

నిరాకారుడైన పరబ్రహ్మ సృష్టి చేయాలని సంకల్పించాడు. అప్పుడు ఆయనలో నుండి ఓంకార నాదం ఉద్భవించింది. ఆ నాదమే ఘనీభవించి బిందువుగా రూపాంతరం చెందింది. ఆ బిందువు మూడుగా విభజించబడి అ, ఉ, మ అనే అక్షరములుగా ఆవిర్భవించింది. వీటినే సృష్టి స్థితి లయ కారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనీ, లేదా ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులైన లక్ష్మి, సరస్వతి, పార్వతి మాతలుగా కూడా అభివర్ణిస్తారు. వీరి నుండి అనేక కళలతో విలసిల్లే ఈ సకల చరాచర సృష్టి అంతా ఆవిర్భవించింది.

అయితే, ఒక కుమ్మరి కుండను తయారుచేయాలంటే మట్టి కావాలి. అలాగే ఒక కంసాలి నగలు చేయాలంటే బంగారం కావాలి. ఒక తల్లి బిడ్డకు జన్మనివ్వాలంటే తండ్రి నుండి బీజం కావాలి. ఇలా మనకు కనబడే ఏ వస్తువును తయారు చేయాలన్నా ఆ తయారు చేసే వ్యక్తికి ఒక ముడిపదార్థం అవసరం అవుతున్నది కదా! మరి తాను తప్ప మరో వస్తువే లేని దశలో పరమాత్మ ఈ సృష్టిని ఏ ముడిపదార్ధంతో తయారు చేశాడు? అనే ప్రశ్న సహజంగా వస్తుంది.

దీనికి పెద్దలు ఊర్ణనాభిని (సాలీడుని) ఉదాహరణగా చూపిస్తారు. సాలీడు ఎలాగైతే తనలో నుండే దారాన్ని తీసి దానితో గూడు అల్లుతుందో, అలాగే పరమాత్మ తనలో నుండే సృష్టిని నిర్మించాడని చెబుతారు. అంటే సృష్టిలోని అణువణువూ పరమాత్మ తత్త్వంతోనే నిండి వున్నదన్నమాట. అయితే సాలెపురుగు ఒకసారి తనలోనుండి దారాన్ని బయటకు తీశాక ఇక తాను వేరు, ఆ దారం వేరు. కానీ, పరమాత్మ మాత్రం తనలో నుండి వచ్చిన సృష్టి అంతటా తానే నిండి వుంటాడు. అక్కడ వేరు చేయడానికి వీలులేదు.

సైన్స్ ప్రకారం శక్తిని కానీ, పదార్థాన్ని కానీ సృష్టించడానికి గానీ, నాశనం చేయడానికి గానీ సాధ్యం కాదు. వాటిని కేవలం ఒక రూపం నుండి మరొక రూపానికి పరిణామం మాత్రమే చెందించగలం. అంటే సృష్టి ఎక్కడి నుంచో క్రొత్తగా రాలేదన్నమాట. అనంత శక్తిస్వరూపుడైన పరమాత్మ శక్తిలోని కొంత భాగమే పదార్థ రూపంగా పరిణామం చెంది

భాసిస్తోంది. అయితే అనంతంలో నుండి ఎంత తీసివేసినా అది అనంతంగానే మిగులుతుంది కానీ, దానికి కొరత రాదు. అలాగే తీసివేయబడిన భాగం కూడా అనంతమే అవుతుంది. ఇదే మనకు **పూర్ణమదః పూర్ణమిదం............** అనే శ్లోకం తెలియజేస్తుంది.

శాస్త్రజ్ఞులు కూడా ఈ సృష్టి ప్రారంభాన్ని వివరిస్తూ ముందు ఒక చిన్న బిందువు వున్నదని, అది మహా విస్ఫోటనం చెంది నక్షత్ర మండలాలుగా, గ్రహాలుగా, జీవరాశిగా (వివిధ కళలుగా) ఏర్పడిందని చెబుతారు. అలాగే చివరకు మళ్ళీ ఈ సృష్టి అంతా ఆ బిందువులోనే లయమైపోతుందని కూడా చెబుతారు. అయితే ఇక్కడ నాదం ఎక్కడ వున్నదని మనకు సందేహం రావచ్చు. ఏ పదార్థమూ లేని శూన్యమంతా ఓంకారనాదమే నిండి వుంటుంది. మీరు ఒక ఖాళీ శంఖాన్ని గానీ, గ్లాసును గానీ, మరేదయినా ఖాళీ వస్తువును చెవి దగ్గర పెట్టుకుంటే, ఓంకార నాదం వినిపిస్తుంది.

అసలు ప్రతి జీవి సృష్టి నాదంతోనే ప్రారంభమవుతుందని వివరిస్తూ, సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు 'జనించు ప్రతి శిశు గళమున పలికిన జీవన నాద తరంగం, చేతన పొందిన స్పందన ధ్వనించు హృదయ మృదంగ ధ్వానం' అన్నారు.

ఇక పైన చెప్పుకున్నట్లు ఈ నాదబిందు కళలనే ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అని కూడా చెబుతారు. శ్రీ గురుదేవులు ఒక ఉదాహరణ చెప్పేవారు. ముందుగా ఒక ఇంజనీరు ఒక పెద్ద డామ్ కట్టాలని సంకల్పిస్తాడు. ఇదే ఇచ్ఛాశక్తి. అప్పుడతడు తన జ్ఞానశక్తిని వుపయోగించి ఆ డామ్‌ను ఒక ప్లాన్ రూపంలో కాగితం మీదకు తెస్తాడు. ఇక దానికి క్రియాశక్తి తోడయితే అది నిజమైన పెద్ద డామ్ ఆకారాన్ని పొందుతుంది.

అయితే, **యద్దృశ్యం తన్నశ్యం** అని చెబుతారు. అంటే మన కళ్ళకు కనబడే, జ్ఞానేంద్రియాలతో గ్రహింపబడేదంతా చివరికి నశించిపోవలసినదే. అలాగే మన ఇంద్రియాలకు గోచరమయ్యే ఈ నాదబిందు కళలు ఎప్పటికైనా నశించిపోయేవే. నిరాకారుడైన పరబ్రహ్మ ఇవి వున్నప్పుడూ లేనప్పుడూ కూడా ప్రకాశించే సచ్చిదానంద స్వరూపులు. అందుకే ఆయన నాదబిందు కళాతీతుడు.

***ఓం నాదబిందు కళాతీతాయ నమః***

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మార్చి 2022**

1 మంగళ - మహాశివరాత్రి - తె.జా 3-30 ని। శ్రీగురుదేవులకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము, ఉ. 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, ఉ. 8గం.లకు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక ఏకాదశరుద్రాభిషేకాలు, మ. 12గం. సహస్రఘటాభిషేకం, లక్షబిల్వార్చన, భక్తసమారాధన. రాత్రి 7గం. శ్రీఉమారామలింగేశ్వర స్వామివారి సామూహిక లీలాకళ్యాణమహోత్సవం, అనంతరం నగరోత్సవం.

2 బుధ - అమావాస్య

5 శని - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీలలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం.

18 శుక్ర - ఫాల్గుణ పూర్ణిమ - హోలీ - శ్రీసద్గురుపాదపూజ

27 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

30 బుధ - మాస శివరాత్రి

**ఏప్రియల్ 2022**

2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది - ఉదయం 10గం. పంచాంగ శ్రవణం, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన

3 ఆది నుండి 9 శని వరకు - మౌన ధ్యాన సాధన సప్తాహ శిబిరం

10 ఆది - శ్రీరామ నవమి - తె॥ 5-30ని॥లకు శ్రీ సద్గురుపాదపూజ, ఉదయం 11గం. శ్రీసీతారాముల సామూహిక కళ్యాణ మహోత్సవము, భక్తసమారాధన.

16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

25 సోమ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

29 శుక్ర - మాస శివరాత్రి

30 శని - అమావాస్య

# శ్రీ ప్రకాశానంద స్వామి

సేకరణ - మురళి

ఆంధ్ర దేశమున విజయనగరం సమీపములోని గ్రామములో 1871, ఫిబ్రవరి 17 శివరాత్రి పర్వదినమున వెలనాటి బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు శ్రీ అనంతయ్య పంతులు. తండ్రి వెంకట్రామయ్య, తల్లి గవరమ్మ. వీరికి 8వ సం.లోనే పితృవియోగము కలుగుటచే తాతగారు నాయనమ్మలైన లక్ష్మీనరశింహము, మీనాక్షమ్మలే బాగోగులు చూసి ఉపనయన సంస్కారము చేశారు. 15 సంవత్సరాల వయసులో పాఠశాల చదువు మాని, సంస్కృతము, జ్యోతిష్యము నేర్చుకున్నారు. తాతగారు, నాయనమ్మ వివాహము చేయవలెనని ప్రయత్నము చేయగా వీరు అత్యంత విముఖత్వమును చూపించి నిరాకరించారు. అత్యంత సౌందర్యవతియైన తన స్నేహితుని భార్య మరణించటం, ఆమె దహన సంస్కారము ప్రత్యక్షముగా చూచుటతోడనే వీరి వైరాగ్యము తీవ్రరూపమును దాల్చి, గురువును అన్వేషించు కొనుచూ ఇల్లు వదిలి వెళ్ళారు.

అనంతయ్యగారు దేశాటనం చేస్తూ కర్ణాటకలోని బెల్గాం చేరుకున్నారు. అప్పటికి వయస్సు 16సం.లు. బెల్గాంలో డిప్యూటీ కలక్టరుగా పనిచేస్తున్న శ్రీ లల్లూభాయి గోవర్ధనదాస్ (గుజరాత్ లోని సూరత్ వాస్తవ్యులు) గారు గొప్ప వేదాంత పరిజ్ఞాత అనియు, ఉత్తమ ఉపదేశికుడని తెలిసి వారి పరిచయము సంపాదించారు. వారు ఆచరణ వేదాంతి, స్థితప్రజ్ఞులు. వారి సన్నిధానమున అనేక వేదాంత గ్రంథములు శ్రవణముచేశారు. అనంతయ్య వైరాగ్యము ఇనుమడించి, సన్యాసాశ్రమము స్వీకరించవలెననే కోరిక మరింత దృఢపడినది. ఇది గమనించిన శ్రీ లల్లూభాయి గారు సన్యాసాశ్రమములోని కష్టసుఖములను వివరించి, ఆ ప్రయత్నమునుంచి విరమింప జెయ్యాలని ప్రయత్నించారు. కాని, అనంతయ్య సన్యాసము స్వీకరించవలెననే దృఢనిశ్చయముతో ఉన్నారు. గురువులు లల్లూభాయి గారి వద్ద శలవు తీసుకుని, తిరుమల చేరుకున్నారు.

పుష్కరిణిలో స్నానము చేసి శిఖ, యజ్ఞోపవీతములను పరిత్యజించారు. అచ్చటినుండి మద్రాసు చేరుకొని శ్రీ బుచ్చయ్య పంతులు

గారి వద్ద ఉపనిషత్తులను సభాష్యముగా అభ్యసించారు. మద్రాసు నుండి నాసిక్ చేరుకుని, అక్కడ కొంతకాలమున్న తరువాత కాలినడకన హరిద్వార్ బయలుదేరారు.

మార్గ మధ్యమున శ్రీ స్వామీ అమరేశానందుల పరిచయము లభించింది. వారు గొప్ప సంస్కృత పండితులు. వారి వద్ద సిద్ధాంత కౌముది, వ్యాకరణ మహాభాష్యము అభ్యసించారు. ఆ స్వామివారే అనంతయ్యకు "ప్రకాశానంద స్వామి" అను నామధేయము ప్రసాదించారు. హృషీకేశ్ చేరుకున్న తరువాత శ్రీ సుఖానంద స్వామి వారి వద్ద ప్రాణాయామముసహా అనేక హఠయోగ ప్రక్రియలు నేర్చుకున్నారు. గుజరాత్ లోని నదియాడ్ వద్ద శ్రీ స్వామి జానకీదాసు మరియు శ్రీ రామానుజం అను పండితుల వద్ద ప్రమేయ గ్రంథములను అభ్యసించారు. శ్రీ ప్రకాశానంద స్వామి వారు ఆశ్రమ స్వీకారానంతరము కూడ తమ గురువు శ్రీ లల్లూభాయి గారు ఉద్యోగరీత్యా ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్ళి, వారి నిర్యాణము వరకు, వారి ఉపదేశామృతమును గ్రోలేవారు.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి, ఏప్రియల్ 2022 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మార్చి 2022 :*** AS 6053, 7453, 7462, 7685, 7687, 8666, 8668 - 8674, 8677, 8678, 8680, 8681, 8685 - 8691, 8693. LM - 4323, 4326, 4327.

***ఏప్రియల్ 2022 :*** AS 7460, 7464, 8023, 8697-8699, 8701-8718.. LM 4328, 4330

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"కాస్త ప్రశాంతంగా ఆలోచించండి. మీరు హరిశ్చంద్ర మహారాజును ఆతని పట్టపురాణియైన చంద్రమతిని విడదీసి, కష్టములకు గురిచేశారు కదా! ఆ పాపకార్యమే మిమ్ములను ఇలా దహించివేస్తున్నది" అన్నారు నారదులు. "దానివలన హరిశ్చంద్రునికి ఆ పరమశివుని దర్శనభాగ్యము కలుగుటయేగాక 'సత్యహరిశ్చంద్రుడ' ను బిరుదుకూడా లభ్యమయ్యిందికదా? అదెలా పాపకార్యమవుతుంది?" అని ప్రశ్నించారు విశ్వామిత్రులు.

"కౌశిక మహామునీ! అంత్యమున మీరు గావించిన పని హరిశ్చంద్రునికి మేలు చేసినప్పటికీ, 'సతి-పతులను విడదీయుట' అనునది పాపకార్యమేకదా!?" అన్నారు. "పరిపూర్ణముగ సత్యమే! దానికి నేను చేయవలసిన పరిహారమేమిటో మీరే మాకు తెలియజేయండి" అని అభ్యర్థించారు విశ్వామిత్రులు.

"ఇక్ష్వాకు కులమందు ఉన్నత రాజ దంపతులను విడదీయుటచే కలిగిన పాపమును పోగొట్టుకొనుటకు, మీరు అదే వంశమున వుధ్భవించబోవు ఒక యువరాజునకు ఆతనికి అనుకూలవతియైన భాగస్వామికిచ్చి వివాహము చేయండి అప్పుడే మీరు ఆ పాపమునుండి విముక్తి పొందగలరు."

"దేవర్షి! సంతానమును పొంద గలుగు వయసును దాటి, వృద్ధాప్యమును జేరుచున్న దశరథ మహారాజుతో ఇక్ష్వాకు వంశము ఒక ముగింపునకు వచ్చుచున్న ఈ స్థితిలో, ఇక మీదట మీ ఆనతిని నేనెలా అమలుచేయగలను?'

"కలత చెందవద్దు కౌశిక మునివర్యా! సాక్షాత్తూ ఆ మహావిష్ణువే దశరథునికి పుత్రునిగ అవతరించి 'రామ' అను నామముతో చేయబోవు పలు దివ్యలీలలు త్వరలో గ్రహించగలరు. ఆ రామునికొరకు మహాలక్ష్మి కూడ 'సీత' అనే నామముతో అవతరించబోతున్నది. విశ్వక్షేమము కొరకు

విడిపోయిన ఆ ఆది దంపతులను మీరు కలిపి, గొప్ప కీర్తిని పొందెదరు. కావున, మీరు ఆ రాముడు విచ్చేయువరకు నిరీక్షించ వలసిందే" యని తెలియజేసి కౌశికమహాముని వద్దనుండి సెలవు తీసుకుని, ఆశ్రమమునుండి బయలుదేరారు నారదమహర్షి.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**మార్చి 2022**

1 మంగళ - మహాశివరాత్రి - శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం.

18 శుక్ర - ఫాల్గుణ పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం.

27 ఆది - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం.

**ఏప్రియల్ 2022**

2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది. - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం

10 ఆది - శ్రీరామ నవమి - శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణమహోత్సవాలు, శ్రీసద్గురు పాదపూజ

16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం.

25 సోమ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ బాబు దినచర్య

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

20-9-1967 : గోదావరి పుష్కరాలు జరుగుతున్నాయి. శ్రీ బాబు భక్తులతో రాజమండ్రి వెళ్ళారు. గోదావరిలో స్నాన సమయంలో ఇరవైమంది భక్తులు మునిగిపోతుంటే, శ్రీ బాబు 'అమ్మా!' అని జగన్మాతను స్మరించుకుని తమ పంచెను ఒకవైపు పట్టుకొని రెండవ వైపు వారి మీదకు విసిరారు. అందరు అది పట్టుకుని బయటకు వచ్చారు. తరువాత శ్రీ బాబు సత్సంగ సమావేశంలో తమ బోధను అందిస్తూ "తల్లులు, తండ్రులు, బంధువులు 'అయ్యో బాబూ! బాబూ! రక్షించండి' అని కేకలు పెట్టారు గాని, ఒక్కరూ రక్షించలేకపోయారే? చూశారా? 'అమ్మా!' అని నేను అమ్మను ప్రార్థించుకున్నాను. అమ్మే రక్షించుకున్నది తన బిడ్డలను. దారాపుత్రాదులూ, బంధుమిత్రులూ అందరూ మానవుని అంత్యకాలంలో గడప వరకో, పొలిమేర వరకో వచ్చేవారే గాని, ఆ తరువాత వెంట వచ్చి రక్షించేది ఆ జగన్నాథుడొక్కడే. ఆ ప్రభువు దివ్యనామ మొక్కటే మానవుని సంసారము నుండి తరింపజేయగల నావ' అని చెప్పారు.



4-10-1967 : దసరాలు గుండుగొలనులో మేడబాబుగారింట్లో ప్రారంభం.

6-10-1967 : తమ బోధామృతాన్ని అందిస్తూ శ్రీ బాబు "జ్ఞానమనే గంగకు వైరాగ్యమనే 'డామ్' (ఆనకట్ట) కట్టి, భక్తి అనే కాలువ త్రవ్వి, మన హృదయమనే క్షేత్రంలోకి ప్రవహింప జేస్తే చవట భూములు కూడా సుక్షేత్రములవుతాయి. ముముక్షుత్వమనే పంట చేతికందుతుంది" అని చెప్పారు.

16-11-1967 : కార్తీక పూర్ణిమ. అమరావతిలో స్నానాలు, ఆలయ దర్శనాలు, రాత్రికి గుంటూరులో గురుపూజ జరిగింది.

17-11-1967 : శ్రీ బాబు అనుగ్రహ భాషణ సందర్భంలో "మా అమ్మ

సంతాన వేణుగోపాల స్వామిని ఆరాధిస్తే, స్వామి స్వప్న దర్శనమిచ్చి..." అంటూ మాట ఆపివేశారు.

16-12-1967 : మార్గశిర శుద్ధ పూర్ణిమ. బోధ చెబుతూ శ్రీ బాబు "మనం ఎన్ని ఊళ్ళు తిరిగినా, ఎన్ని హొటళ్లలో బస చేసినా, మళ్ళీ మన యింటికి ఎప్పుడు వెడదామా అని ఆదుర్దా పడతాము. మన యింటికి మనం చేరితేనే శాంతి. అలాగే మానవుడు భగవంతుని వద్ద నుండి వచ్చాడు కనుక మళ్ళీ ఆ భగవంతుని వద్దకు చేరినప్పుడే అతనికి శాంతి. ఈ శరీరము హొటల్ వంటిదే గాని, స్వంత యిల్లు కాదు గదా?" అన్నారు.

2-1-1968 : ఈ తేదీ నుండి బాబు భక్తులందరితో దక్షిణ దేశ యాత్రకు బయల్దేరారు. శ్రీశైల క్షేత్రంలో యాత్ర ప్రారంభమైనది.

"ఈ యాత్రకు రాలేకపోయిన వారు బాధ పడవద్దు. నేను అన్ని క్షేత్రాలలోనూ అభిషేకాలు, స్నానాలు, పూజలు, దర్శనాలు అన్నీ చేసి, కావలసినంత పుణ్యం సంపాదించి తెచ్చి మీ అందరికీ పుష్కలంగా పంచుతాను" అని అభయమిచ్చారు శ్రీ బాబు.


**శ్రీ కాళీ ప్రసాద ఆశ్రిత ఆశ్రయం**

పగిడ్యాల రోడ్, శ్రీ రామ చంద్ర మిషన్ ప్రక్కన,

నందికొట్కూరు, కర్నూలు జిల్లా, పిన్ 518401

ఈ ఆశ్రిత ఆశ్రయము ది. 06.11.2021న శ్రీ కాళీమనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ, నంబూరు వారిచే ప్రారంభించబడినది. 32 గదులతో ఈ మూడు అంతస్తుల భవనము నిర్మింప బడినది. ఈ ఆశ్రయము ఎవరూ లేని అనాధ వృద్ధులు; అందరూ ఉండి ఆదరణకు నోచుకోనివారు; ఒంటరిగా ఉండేవారు ఈ ఆశ్రయములో చేరవచ్చును.

ఈ ఆశ్రమంలో చేరే వారు రూ.10000/- డిపాజిట్ కట్టవలెను. నెలకు రూ 4000/- కట్టవలెను. నిరుపేదలకు ఉచితము.

శ్రీ కాళీ ప్రసాద ఆశ్రితాశ్రం సొసైటీ, నందికొట్కూరు

సెల్ : 9398118475

## సత్సంగం సేకరణ - భీమవరం గుప్తా

ఒక సమస్య కలిగినా, ఒక హోదా లభించినా మన సాంగత్య ప్రభావం వాటిపై ఉంటుంది. మన చుట్టూ ఉండే వారి స్వభావాలు, మన లక్షణాలు మన ఆలోచనలను మలచుతాయి. ఆవేదననో, ఆనందాన్నో పెంచుతాయి. ఒక దుఃఖం, అనుకోని ప్రతికూలఘటన ఎదురైనప్పుడు మనస్సు క్రుంగిపోవడం సహజం. అలాంటి తరుణంలో మనం చదివే పుస్తకం, వినే సంగీతం, చూసే దృశ్య కార్యక్రమాలు సరియైనవైతే మనస్సు ధైర్యాన్ని పొందుతుంది. విపరీత భావాలు కలుగకుండా నిలదొక్కుకోగలం. ధర్మాన్ని బోధించేవీ, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేవి, జీవిత సత్యాన్ని తాత్వికంగా ఎరుకపరచేవీ, ధీర గుణాన్ని ప్రోది చేసేవీ అయిన 'సాంగత్యాలు' ఎప్పుడూ మనల్ని ముందుకు నడిపిస్తాయి.

ప్రపంచం బహు విస్తారం. జీవితం అనేక అవకాశాలమయం. కానీ ఆ విస్తారమూ ఆ అవకాశాలూ మన బుద్ధి విశాలతను సంతరించుకున్నప్పుడే గోచరిస్తాయి. ఒక్క చిన్న అవకాశం చేజారగానే దిగులు పడిపోయి, బ్రతుకంతా శూన్యమనుకొనే వారు ఎందరో! ఒక్క కష్టానుభవానికే చతికిలబడి 'ఇంకేముంది! అంతా అయిపోయింది' అనుకునే వారు ఎందరో! అలాంటి స్థితిలో ఆత్మహత్యలకి పాల్పడే వారెందరో! అలాంటి పరిస్థితుల్లో ఏ ఋషిగ్రంథాల వాక్యమో, గురూపదేశ నిర్దేశమో, వివేకానందుని వంటి మహావ్యక్తుల మాటలో, మహాత్ముల జీవిత ఘట్టాలో మన ఆలోచనల్లో ప్రవేశిస్తే కొత్త ఉత్తేజం, బలం సమకూరతాయి. కొండంత సమస్యనైనా దూదిపింజలా తీసుకోగలిగే దిటవు ఏర్పడుతుంది.

**'కావ్యశాస్త్ర వినోదేన కాలోగచ్ఛతి ధీమతాం'** - కావ్యశాస్త్ర చర్చలే వినోదంగా బుద్ధిమంతుల కాలం గడుస్తుందంటుంది ఈ సుభాషితం.

మంచి సాహిత్య సంగీతాలు ఒక మాధుర్యాన్ని, ఉపశమనాన్ని కలిగించడమే కాక, అంతరంగానికి నూత్న కోణాల ఆలోచనల్నీ, ఆశావాదాన్నీ, జీవిత ప్రయోజనాన్నీ ప్రబుద్ధం చేస్తాయి. అలాంటి గ్రంథాలను, కళలను, ధార్మికోపదేశాలను నిరంతరం ఆస్వాదిస్తూ, ఆలోచిస్తూ, ఆచరణలో పది మందికీ పనికొచ్చేలా మసలుకొనేవాడు నిత్యోత్సాహి - చైతన్యశీలుడు. అలా ఆస్వాదించే పరిస్థితులను కలుగజేసేదే 'సత్సంగం'.

- సశేషం

# సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | | |
|---|---|---|
| ప్రచురణ స్థలం | - | శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - | మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - | సి.వి. రమణబాబు |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - | పాలూరి శివరామ కాళీప్రసాద్ |
| జాతి | - | భారతీయుడు |
| విలాసము | - | D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - | యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియజేస్తున్నాను.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణ బాబు

ది. 1-3-2022

# విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## జనాబాయి

అందరూ నిద్రపోయాక పాండురంగడు లేచాడు. "జనా! నాకు ఆకలిగా ఉంది. భోజనం వడ్డించు" అన్నాడు. జనాబాయి భోజనం పెట్టింది. జనాబాయి ఎదురుగా కూర్చుని ఆ దివ్యమంగళ స్వరూపాన్ని చూస్తోంది. స్వామి కొద్దిగా రుచి చూశాడు. "జనా! భోజనం చాలా రుచికరంగా ఉంది. నువ్వుకూడా కాస్త తిను" అంటూ స్వామి తన స్వహస్తాలతో తినిపించాడు. ఆహా ఎవరికి కలుగుతుంది ఆ భాగ్యం? అది బ్రహ్మాది దేవతలకు కూడా దొరకదు. స్వామి అందించిన పదార్థాన్ని భుజించగానే జనాబాయి అనూహ్యమైన అనుభవ శిఖరాలను అందుకుంది. ఈ అపూర్వ అవకాశం ఎవరికి లభిస్తుంది? బృందావనంలో గోపబాలురకు, రాధకు లభించి ఉంటుందేమో. ఆ కోవకు చెందిన భక్తురాలు కనుకనే జనాబాయి ఆ అదృష్టానికి నోచుకొంది. జనాబాయితో ఆధ్యాత్మిక విషయాలను ముచ్చటించి బ్రహ్మముహూర్త కాలంలో అదృశ్యమై ఆలయంలో భక్తులకు దర్శనమివ్వటానికి బయలుదేరి వెళ్ళాడు.



ఒకసారి ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు నామదేవులవారి గృహానికి జ్ఞానదేవులు, నివృత్తినాథుడు, సోపాన్, ముక్తాబాయిలు వచ్చారు. వారివెంట రామానంద స్వామి, కబీర్‌దాసులు కూడా వచ్చారు. ఆ సమయంలో నామదేవులు ఇంట్లో లేరు. జనాబాయి తాను ఆవు పేడతో చేసిన పిడకలు తీసుకొని వెళ్ళినదని ప్రక్కింటి ఆవిడతో జగడం చేస్తూ ఉంది. వాగ్వివాదాలు తారాస్థాయికి చేరటంతో అక్కడకు వెళ్ళిన భక్తులు ఆశ్చర్యపోయారు. కబీర్‌దాస్ ముందుకు వచ్చి "అమ్మా

జనాబాయి! నీ పొరిగింటి ఇల్లాలు కూడా పిడకలు చేసింది. ఆవిడ తీసుకున్నవి నీవు తయారు చేసినవే అని ఎలా చెప్పగలవు" అని అడిగాడు. అందుకు జనాబాయి "మహాత్మా! వాస్తవాన్ని తెలుసుకోగల ఉత్తములు మీరు. న్యాయమెవరిదో మీరే తేల్చి చెప్పండి. నేను పిడకలు చేస్తున్నప్పుడు పాండురంగడి నామం చేస్తూ చేశాను. మీరు నేను తయారుచేసిన పిడకలను చెవి దగ్గర వుంచుకోగానే అవి పాండురంగడినామాన్ని వినిపిస్తాయి" అని చెప్పింది. కబీర్‌దాస్ పరీక్షచేసి చూస్తే జనాబాయి తయారు చేసిన పిడకల నుండి శ్రావ్యంగా "పాండురంగా" "పాండురంగా" అని వినిపించింది. జనాబాయి భక్తి ప్రపత్తులకు కబీర్‌దాస్ మున్నగు భక్తులు భక్తిపారవశ్యంతో ఆనందాశ్రువులు కార్చారు.

జనాబాయి కీర్తి ప్రతిష్ఠలు నలువైపులా వ్యాపించాయి. ఆమెను అందరూ మహా భక్తురాలు అని ప్రశంసించారు. ఆమె దర్శనం కోసం అనేక గ్రామాలనుండి వస్తున్నారు. ఆమె శాస్త్ర విషయాలను ఏకరవు పెట్టదు. ఆచరణమే ఆవిడ వేదాంతం. అహంకారం ఆమెలో అసలు లేదు. నమ్రతయే ఆమె జీవన విధానం. ప్రేమయే ఆమె జీవన తపస్సు. తాను పాండురంగని కృప పొందిన విధానాన్ని ఒక చక్కటి కీర్తన ద్వారా తెలియ చేసింది.

**ధరిలా పంఢరీచె చోర గలా బంధోనియా దొర**
**హృదయ బందీఖానా కేలా అంత విఠల కోందిలా**
**శబ్దకేలీ జుడా జుడీ। విఠల పాయీ ఘూతలీ బేడీ**
**సోహం శబ్దాచా మారా కేలా। విఠల కాకులతీ ఆలా**
**జనీమ్హాణీ బా విఠలా । జీవేం స సోడీ మితులా ॥**

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

శ్రీ కాళీవనాశ్రమంలో జరిగిన భోగి పండుగ దృశ్యములు



సద్గురు పాదపూజ



సద్గురుమూర్తికి భోగిపళ్ళు పోస్తున్న భక్తులు



భక్తులకు భోగిపళ్ళ ప్రసాద వితరణ

Regd. News Magazine Periodical
Posted on 5th and 6th of every month

RNI No. 37804/81
Postal Regd. No.: GTR/27/2021-2023



సంక్రాంతి పండుగనాడు భక్తులచే సద్గురు పాదపూజ



ధనుర్మాసంలో భాగవత ప్రవచనం చేసిన
శ్రీ రామానుజదాసు గారికి సన్మానం

*If undelivered please return to*
**SAMARDHA SADGURU**
SRI KALI GARDENS
Ashramam-522 508, Guntur Dist., A.P.